VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 05 ఆగష్టు 2024
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 08




2లో

## 100లో నోవాహ్

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగర్‌కు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ
- రిజర్వాయర్ నుంచి 5లక్షల క్యూసెక్కులు దిగువకు
- సాగార్జున సాగర్ వద్ద ఇన్ ఫ్లో 3 లక్షల క్యూసెక్కులు
- రేపు సాగర్ గేట్లు ఎత్తేందుకు అధికారులు సన్నాహాలు



# శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగర్‌కు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

శ్రీశైలం :జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి భారీగా వరద ఉధ్ధృతి పెరుగుతోంది. గంట గంటకూ నీటి మట్టం పెరుగుతూ జలాశయం నిండుకుండగా మారింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి నాలుగు లక్షలకు పైగా క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతున్నది. దీంతో డ్యామ్ గేట్లు ఎత్తి 5 లక్షల క్యూసెక్కులకుపైగా విడుదల చేయడంతో నాగార్జునసాగర్‌కు కృష్ణమ్మ పరుగులు తీసున్నది. నాగార్జున సాగర్ కూడా నిండుకుండలా మారిపోతున్నది. దీంతో సాగర్ నుంచి కూడా నీటిని దిగువకు విడుదల చేయనున్నారు.

**శ్రీశైలం, నాగార్జున సాగర్ వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు ఇలా..**

ఈ ఉదయం 7 గంటలకు శ్రీశైలం జలాశయానికి 4,06,236 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఔట్ ఫ్లో 5,50,731 క్యూసెక్కులగా ఉంది. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 882.2 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 200.2 టీఎంసీలు (92.77శాతం) గా ఉంది. శ్రీశైలం కుడి, ఎడమల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. నాగార్జున సాగర్ విషయానికి వస్తే ఉదయం 9 గంటల సమయానికి నీటి మట్టం 572.7 అడుగులుగా ఉంది

. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 263.35 (84.39) టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్ ఫ్లో 3,14,409 క్యుసెక్కులుగా నమోదైంది. 35,409 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో 19 అడుగుల మేర నీటి మట్టం చేరుకుంటే గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తారు. ఇన్ ఫ్లో ఇదే విధంగా కొనసాగితే రేపు సాయంత్రానికి సాగర్ గేట్లను ఎత్తే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రాజెక్టు అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. ముందుగా కొంత మేర క్రస్ట్ గేట్లు పైకి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు.

## విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ‘ఆల్ ది బెస్ట్’



పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్లిన సీఎం బృందం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అనుకూలమైన వ్యవస్థను రూపొందించామన్న కేటీఆర్ రాజకీయాలు పక్కన పెట్టి, తెలంగాణ ఫస్ట్ అనేదే తమ నినాదమని వ్యాఖ్య

**హైదరాబాద్:** పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి బృందానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ‘ఆల్ ది బెస్ట్’ చెప్పారు. రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులను ట్యాగ్ చేస్తూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. కొన్ని మీడియా సంస్థలు ఇచ్చిన సీఎం బృందం షెడ్యూల్‌ను తాను చూశానన్నారు. ఏళ్లుగా ఎంతో కష్టపడి తాము పట్టుదలతో సంబంధాలను పెంపొందించామని, ఇప్పుడు ఈ ప్రభుత్వం ప్రముఖ కంపెనీల నుంచి పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్న కంపెనీలు విస్తరణకు ఆసక్తి చూపిస్తున్నాయంటే ఇందుకు తెలంగాణ పారిశ్రామిక విధానాలు, విజయాలే నిదర్శనమని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఆర్థికాభివృద్ధికి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. తాము టీఎస్–ఐపాస్ వంటి అనేక వినూత్న విధానాలు తీసుకువచ్చామని గుర్తు చేశారు. భౌతిక, సామాజిక మౌలిక సదుపాయాలలో గణనీయమైన పెట్టుబడులు పెట్టామన్నారు. గత దశాబ్దంలో, ఈ ప్రయత్నాల ఫలితంగా రూ. 4,00,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించినట్లు తెలిపారు.

## ‘ఫోర్త్ సిటీ’ వెనుక కాంగ్రెస్ సర్కార్ భూదందా



**హైదరాబాద్:** ఫోర్త్ సిటీ వెనుక కాంగ్రెస్ భూదందా కొనసాగుతోందని.. వేల ఎకరాలను సేకరించి దోచుకునే కుట్ర జరుగుతోందంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం.. గుర్రంగూడలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను ముందుగానే సేకరించి.. రియల్ ఎస్టేట్ దందా చేస్తూ వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు సిద్ధమయ్యారని బండి సంజయ్ ఆరోపించారు.

ధరణిపై భూముల అన్యాక్రాంతంపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసిన బండి సంజయ్.. ధరణిపై వేసిన కమిటీ ఏం తేల్చిందంటూ ప్రశ్నించారు.

కేసీఆర్ కుటుంబ భూదోపిడీపై చర్యలేవి?. కాంగ్రెస్‌కు హిందూ పండగలంటే అంత చులకనెందుకు?” అంటూ ఆయన నిలదీశారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని.. ఆ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని వ్యాఖ్యానించారు.



4లో

## ప్రభుత్వాలు విద్య వైద్యం ఉచితంగా అందించాలి.




4లో

## కల్లుడిపో “కులం” కోసమా... “కుటుంబం” కోసమా?.

మూడో డిపోలో ముగ్గురిదే పెత్తనం.

సొసైటిలో అక్రమాలపై అనేక పిర్యాదులు.

ఎక్సైజ్ శాఖ స్పందించక పోవడం పై అనుమానాలు.



## పారిశుద్ధ్య లోపంతో 19 మంది విద్యార్థులకు అస్వస్థత

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పారిశుద్ధ్య లోపం, వంట గదుల్లో అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు తరచూ రోగాల బారిన పడుతున్నారు. వికారాబాద్ మండలం అనంతగిరిపల్లి గురుకుల పాఠశాలలో ఆదివారం నలుగురు విద్యార్థులకు పచ్చకామెర్లు సోకడంతో చికిత్స పొందుతున్నారు. గత జులై 5న ఇదే పాఠశాలలో 45 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని వాంతులు, విరేచనాలతో ఆసుపత్రి పాలైన సంఘటన తెలిసిందే. తాజాగా వికారాబాద్ మండలంలోని బూర్గుపల్లి గురుకుల పాఠశాలలో కూడా 15 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

**వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పారిశుద్ధ్య లోపం, వంట గదుల్లో అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు తరచూ రోగాల బారిన పడుతున్నారు.**

**చికిత్స కోసం వికారాబాద్ ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులు**

# 100లో నోవావ్




పారిస్ : ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత వేగవంతమైన మనిషెవరో తేలిపోయింది. ఆ సంగతి తేల్చే ఒలింపిక్స్ 100 మీటర్ల పరుగు పూర్తయింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 1.20 గంటలకు జరిగిన పారిస్ ఒలింపిక్స్ 100 మీటర్ల పరుగులో అమెరికా అథ్లెట్ నోవా లైల్స్ విజేతగా నిలిచాడు. అతను 9.79 (.784) సెకన్లలో లక్ష్యాన్ని చేరుకున్నాడు. అత్యంత హోరాహోరీగా సాగిన ఫైనల్లో వెంట్రుకవాసి తేడాలో కిషేన్ థాంప్సన్‌ను వెనక్కి నెట్టి నోవా స్వర్ణం ఎగరేసుకుపోయాడు. కిషేన్ కూడా 9.79 (.789) సెకన్లలోనే లక్ష్యం పూర్తి చేయగా.. ఫొటో ఫినిష్‌లో నోవా కాస్త ముందున్నట్లు తేలింది. రేసులో చాలా వరకు కిషేనే ముందంజలో ఉండగా.. మధ్య దశ వరకు వెనుకంజలో ఉన్న నోవా రేసు రెండో అర్ధంలో బలంగా పుంజుకుని ఒక్కో అథ్లెట్‌ను దాటుకుంటూ ముందుకు వెళ్లిపోయాడు. నోవా, కిషేన్ దాదాపుగా ఒకేసారి రేసును పూర్తి చేసినట్లు కనిపించగా.. విజేతను తేల్చేందుకు ఫొటో ఫినిష్ చూడాల్సిన అవసరమొచ్చింది. ఫ్రెడ్ కెర్లీ (అమెరికా) 9.81 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం గెలిచాడు. కెర్లీ 2020 ఒలింపిక్స్‌లో రజతం గెలిచాడు. డిఫెండింగ్ ఛాంపియన్ మార్సెల్ జాకబ్స్ (ఇటలీ) 9.85 సెకన్లతో అయిదో స్థానానికి పరిమితమయ్యాడు. సింబైన్ (దక్షిణాఫ్రికా–9.82 సె) నాలుగో స్థానం సాధించగా.. టెబాగో (బోట్సువానా–9.86 సె), బెడ్నారెక్ (అమెరికా–9.88 సె), సెవిల్లె (జమైకా–9.91 సె) వరుసగా 6, 7, 8 స్థానాల్లో నిలిచారు. ఉసేన్ బోల్ట్ నిష్క్రమణ తర్వాత కళ తప్పిన 100 మీటర్ల పరుగుకు మళ్లీ కొంత ఆకర్షణ తీసుకొచ్చిన స్ప్రింటర్లలో నోవా లైల్స్ ఒకడు. ఈ ఏడాది అతడిదే అత్యధిక వేగం. ఇటీవలే డైమండ్ లీగ్ 100 మీ.లో తన అత్యుత్తమ వేగం (9.81 సెకన్లు)తో స్వర్ణం సాధించాడీ అమెరికన్ స్ప్రింటర్. టోక్యో ఒలింపిక్స్‌లో లైల్స్ 200 మీటర్ల పరుగులో కాంస్యం సాధించాడు. రెండేళ్లుగా ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో 100, 200 మీ. పరుగుల్లో లైల్స్‌దే ఆధిపత్యం. నిరుడు ఈ రెండు పరుగుల్లోనూ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడతను. అంతకుముందు ఏడాది కూడా ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో 200 మీ. పరుగు విజేతగా నిలిచాడు. ఇప్పుడు పారిస్ ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగి.. వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్‌తో స్వర్ణం సాధించాడు.

# అధ్యక్ష అభ్యర్థుల మధ్య చర్చ

## కమలతో చర్చకు సిద్ధమన్న ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధికార డెమోక్రటిక్ పార్టీ తరఫున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైంది. ఈ నేపథ్యంలో ఆమెతో ముఖాముఖి చర్చ జరిపేందుకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమయ్యారు. ఈ మేరకు ఫాక్స్‌న్యూస్ ఆఫర్‌ను ఆయన అంగీకరించారు. ఈవిషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో తాజాగా వెల్లడించారు. వచ్చే నెలలో వీరి మధ్య డిబేట్ జరగనుంది. సెప్టెంబరు 4న ఫాక్స్ న్యూస్ నిర్వహించే ఈవెంట్‌లో కమలా హారిస్ తో డిబేట్ జరిపేందుకు అంగీకరించా. వాస్తవానికి ఇదే తేదీన ఏబీసీ ఛానల్‌లో జో బైడెన్‌తో నేను ముఖాముఖి చర్చలో పాల్గొనాల్సింది. అధ్యక్ష రేసు నుంచి ఆయన వైదొలగడంతో ఆ డిబేట్ రద్దయ్యింది. ఫాక్స్‌న్యూస్ డిబేట్ పెన్సిల్వేనియాలో జరుగుతుంది. బైడెన్‌తో జరిగిన చర్చలోని రూల్స్ అన్నీ దీనికి వర్తిస్తాయి. కానీ ఈసారి పూర్తిస్థాయిలో ప్రేక్షకులు కూడా ఉంటారని ట్రంప్ వెల్లడించారు. అయితే.. ఈ డిబేట్, దాని కండీషన్స్‌కు హారిస్ అంగీకరించారా? లేదా అన్నది మాత్రం ఇంకా తెలియరాలేదు. ట్రంప్‌తో చర్చ గురించి ఆమె ప్రతినిధులు ఇంకా స్పందించలేదు. అయితే, ఆయనతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధమేనని గతంలో కమలా హారిస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటికి ఆమె అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో ట్రంప్ దానిపై స్పందించలేదు. తాజాగా హారిస్ పోటీ ఖాయమవడంతో డిబేట్‌కు అంగీకరిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు పేర్కొన్నారు. కమలా హారిస్, ట్రంప్ మధ్య ముఖాముఖి చర్చ జరిగితే.. అది ఈ ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరగనున్న రెండో డిబేట్ కానుంది. జూన్‌లో బైడెన్, ట్రంప్ మధ్య తొలి డిబేట్ జరిగిన సంగతి తెలిసిందే.

# ఆపదలో తోడుగా.. నిలిచేదే స్నేహం.

**- స్నేహితుల దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం.**

**వేగుచుక్క న్యూస్, నకిరేకల్, ఆగస్టు 4:**

ఆపదలో తోడుగా..అన్నింటా నీడగా నిలిచేదే స్నేహం అని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నకిరేకల్ పట్టణంలోని నారాయణ రెడ్డి పంక్షన్ హాల్లో నిర్వహించిన వేడుకకు ఎమ్మెల్యే వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహం గొప్ప నెట్వర్క్ అని అన్నారు. భవిష్యత్తుకు మంచి మార్గనిర్దేశం, జీవిత లక్ష్యాలను చేరుకునేలా వెన్నుతట్టి నిలిస్తుందని పేర్కొన్నారు. మనకు ఏ సమస్య వచ్చినా వారి సమస్యగా భావించి భరోసా కల్పించి, బాధ్యతగా ఉండే వారే అసలైన స్నేహితులు అని అన్నారు. ఏ సమస్య వచ్చినా మెదటగా చెప్పుకునేది స్నేహితులకే, ఆ తర్వాతనే కుటుంబ సభ్యులకు చెబుతాం అని అన్నారు. స్నేహంలో స్వార్థం ఉండదు, కష్టసుఖాల్లో తోడుండేదే నిజమైన స్నేహం అన్నారు. అంతకు ముందుఅక్కడ ఉన్న మిత్రులతో చిన్ననాటి నుండి నేటి వరకు జ్ఞాపకాలను ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని, అనంతరం అక్కడికి

వచ్చిన ప్రతి ఒక్కరికి ఫ్రెండ్ షిప్ బ్యాండ్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప తో పాటు పెద్దఎత్తున తరలి వచ్చిన స్నేహితులు పాల్గొన్నారు.









# అక్రమార్కులను వదిలే ప్రసక్తి లేదు



## పాలనను గాడిలో పెడుతున్నాం

## మీడియాతో సిఎం చంద్రబాబు


**అమరావతి :** అక్రమాలకు పాల్పడిన అధికారులను వదిలేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. పాలనను గాడిలో పెడుతున్నామని, అక్రమాలను వెలికి తీస్తున్నామని అన్నారు. అక్రమార్కులు ఎవరైనా వదిలి పెటట్బోమని అన్నారు. మంగళగరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినతులు అన్నింటిని పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సమస్యలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైకాపా కారణంగా ప్రతి మండలంలోనూ ఓ భూకుంభకోణం వెలుగు చూస్తోందని తెలిపారు. రికార్డులను కూడా తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. రీసర్వే అస్తవ్యస్తంగా జరగడం వల్లే ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయి. ప్రతి జిల్లాలో రెవెన్యూ సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రాధాన్యం ఇస్తాం. రెవెన్యూ శాఖను గత ప్రభుత్వంలో నిర్వీర్యం చేశారు. మదనపల్లె ఘటనే రెవెన్యూ శాఖ నిర్వీర్యానికి ఉదాహరణ. వ్యవస్థలను 100 రోజుల్లో గాడిన పెడతాం. రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేస్తాం. భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. సమస్యలను విభాగాల వారీగా విభజించి పరిష్కరిస్తాం. వినతులు ఇచ్చేందుకు అమరావతి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. నియోజకవర్గాలు, జిల్లాల్లో ఫిర్యాదులు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తాం. నా పర్యటనల వల్ల ఎవరూ ఇబ్బందిపడకుండా మార్పులు తెస్తాం. శాఖల వారీగా సమీక్షలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చంద్రబాబు తెలిపారు.

# ఇంత నిర్లక్ష్యమా?.. కాంగ్రెస్ సర్కార్‌పై హరీష్‌రావు ఫైర్

హైదరాబాద్: భావి భారత పౌరుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి హరీష్‌రావు మండిపడ్డారు. ఎక్స్(ట్విటర్) వేదికగా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు."నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సరైన భోజనం లేక ఆకలితో ఉన్న విద్యార్థులు కారం, నూనెతో అన్నం కలుపుకుని కడుపు నింపుకొన్నారు. ప్రభుత్వం భావిభారత పౌరుల పట్ల ఇంత బాధ్యతారహితంగా వ్యవహరించడం బాధాకరం. విద్యార్థులకు పౌష్టికాహారం కోసం అందించే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రభుత్వం అటకెక్కించింది" అంటూ ట్వీట్ చేశారు."ఇప్పుడు మధ్యాహ్న భోజనం అందించడంలో తీవ్రంగా విఫలమైంది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి భోజన సామాగ్రి బిల్లులు, కుక్ కమ్ హెల్పర్ల వేతనాలు పెండింగ్ ఉండడం వల్ల విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి, మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులను, కార్మికుల

జీతాలను చెల్లించి, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కడుపు నింపాలని కోరుతున్నాను" అని హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు.





వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
సోమవారం 05 ఆగస్టు 2024

# ఎస్సీ వర్గీకరణ పోరాటానికి విజయం !

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా..అణగారిన వర్గాలకు న్యాయం జరగడం లేదు. రిజర్వేషన్ల ఫలాలు కొందరికే దక్కుతున్నాయి. కొందరే వీటి ద్వారా లబ్ది పొందుతున్నారు. వారే ఎస్సీ,ఎస్సీ నేతలుగా చలామణి అవుతున్నారు. ఆర్థికంగా బలపడిన వారు సైతం ఇంకా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్నారు. ప్రధానంగా ఎస్టీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాటాలు సాగిస్తున్నారు. మందకృష్ణ మాదిగా ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం జరిగినా.. న్యాయం జరగలేదు. ఈ ఉద్యమంలో ఎందరో అసువులు బాసారు. ఎట్టకేలకు సుప్రీం ధర్మాసనం ఈ సమస్యకు న్యాయమైన తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా రాష్ట్రాలు ఉపకులాలకు అనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియను అంటే..వర్గీకరణను నిర్వచించుకునే అవకాశం, స్వేచ్ఛను ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టీకరించింది. సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెల్లడించింది. గురువారం నాడు వర్గీకరణపై సుదీర్ఘ విచారణ జరిపిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సమర్థనీయమని స్పష్టం చేసింది. కాగా.. ఈ వర్గీకరణ ను మెజారిటీ సభ్యులు సమర్థించగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. అయితే ఈ తీర్పుతో ప్రభుత్వాలు మేల్కొనాలి. ఇంతకాలం అన్ని వర్గాలకు న్యాయం జరరగడం లేదని తీర్పుతో గుర్తించాలి. నిజానికి దేశంలో రిజర్వేషన్లు కొన్ని కుటుంబాలకే పరిమితం అయ్యాయి. ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రధానంగా చర్చించాలి. ఓ రకంగా చెప్పాలంటే.. స్వాతంత్ర్యానంతరం బడుగు, బలహీనవర్గాలను, నిమ్నజాతులను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో తీసుకుని వచ్చిన రిజర్వేషన్లు పాక్షిక విజయం మాత్రమే సాధించాయి. దళితులు ఆదివాసీలు ఇంకా సమాజంలో దూరంగానే ఉండే పరిస్థితులు ఉన్నాయి. వారిని సమాజంలో భాగం చేసే కార్యక్రమాల అమల్లో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడమే దీనికి కారణం. రిజర్వేషన్ల లక్ష్యం నెరవేర లేదనడానికి ఆర్థికంగా వెనకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం రావడమే. దేశంలో ప్రతి ఒక్కరూ సగర్వంగా బతకగలిగేలా దేశాన్ని ముందుకు తీసుకుని పోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతూ వచ్చాయి. రిజర్వేషన్లు పొందుతున్న కుటుంబాలు అదేపనిగా లబ్దిపొందుతున్నాయి. రిజర్వేషన్లు అందని వారు అలాగే వెనకబాటులో ఉన్నారు. నిజానికి చట్టసభలనే తీసుకుంటే రిజర్వేషన్లను పొందుతున్న వారు జీవితాంతం వాటి ద్వారా లబ్దిపొందుతున్నారు. వారే సర్పంచ్ నుంచి ఎంపిల వరకు ఎన్నికవుతున్నారు. కొన్ని కుటుంబాల వారికే రిజర్వేషన్ పదవులు దక్కుతున్నాయి. దీనిపై ఎక్కడా చర్చ జరగడం లేదు. దీనిపై సమీక్ష జరగడం లేదు. ఒకే కుటుంబం జీవితాంతం రిజర్వేషన్ల లబ్ది పొందుతూ పోతే కోట్లాదిమంది ఉన్న ఈ దేశంలో అందరికీ రిజర్వేషన్ల ఫలాలు ఎలా అందుతాయో పాలకులు గమనించడం లేదు. దేశంలో గౌరవంగా బతకడానికి అవకాశాలు కల్పించకపోవడం వల్ల రిజర్వేషన్లతో పైపూత పూసే యత్నం చేస్తున్నారు. ఈ దశలో రిజర్వేషన్లపై సమగ్ర చర్చ జరగాలి. ఎస్సీ ,ఎస్టీల్లో రిజర్వేషన్లు అందరికీ న్యాయంగా దక్కాలి. ముఖ్యంగా చట్టసభల్లో రిజ్వేషన్లు కొన్ని కుటుంబాలే ఎగురేసుకు పోతున్నాయి. ఇందులో అందరికీ న్యాయం దక్కాలి. దేశంలోని ఎస్సీ,ఎస్టీలు అందరికీ ఈ ఫలాలు దక్కాలనే అవసరాన్ని గుర్తించి అమలు చేసేలా సమగ్ర విధానం రావాలి. కొన్నికుటుంబాలే రాజకీయలబ్ది పొందే యత్నాలను అడ్డుకునేలా చేయాలి. నిజానికి మన విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయి. అవి సక్రమంగా అమలయివుంటే రిజర్వేషన్లప చర్చ చేసే అవసరం రాదు. కుల, మతాలతో నిమిత్తం లేకుండా ప్రతి పేదవ్యక్తీ హుందాగా జీవించేలా చూడటమే ప్రభుత్వాల లక్ష్యం కావాలి. అయితే ఇప్పుడున్న ఎస్సీ,ఎస్టీలు అందరితో సమానంగా ఎదగాలంటే రిజర్వేషన్లు సమానంగా అందించడం మినహా ప్రభుత్వం ముందు మరో మార్గం లేదనే చెప్పాలి. ఎస్సీ వర్గీకరణపై విపక్షాలు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా చివరకు ఒప్పుకోక తప్పలేదు. రాజకీయంగా కీలకమైన అంశానికి పార్టీలకు అతీతంగా మద్దతు లభించింది. విపక్షాలు తొలుత అనుమానాలు వ్యక్తం చేసినా, ఎక్కడ తాము ఆ వర్గాలకు వ్యతిరేకం కావలసి వస్తుందేమో అన్న భయంతో అన్ని పక్షాలు మద్దతు ఇస్తూ, వర్గీకరణకు తాము వ్యతిరేకం కాదని చెప్పాయి. మొత్తంగా ఇప్పుడు ఈ రిజర్వేషన్ల వర్గీకరణ అన్నది అత్యతంత వెనకబడిన మాది, మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు చేకూరుస్తుంది. ఇదే సందర్భంగా మొత్తం ప్రక్రియపై చర్చించాలి. రాజకీయంగా ఏళ్లుగా రిజర్వేషన్ లబ్ది పొందుతున్న కొన్ని కుటుంబాలు నిరంతరంగా లబ్ది పొందకుండా చూడాలి. మిగతా కుటుంబాలకు కూడా ప్రయోజనాలు చేకూరాలన్న సంకల్పాన్ని ప్రకటించాలి. ఈ కులాల్లోని అన్నివర్గాల ప్రజలకు దీనివల్ల లబ్ది చేకూరిందా లేదా అన్నది చూడాలి. రిజర్వేషన్లను కేవలం అవసరమైన వారికే కల్పించేలా చూడాలి. ఇప్పటికే లబ్దిపొందిన కుటుంబాలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేలా చట్టం చేయాలి. అప్పుడే రిజర్వేషన్ ఫలాలు అందరికి అందుతాయి. సుప్రీం తీర్పును స్వాగతిస్తూ అవసరమైతే పార్లమెంట్ చర్చించాలి. చట్టసభల్లో రిజర్వేషన్లు కొందరికే పరిమితం కాకుండా చూడాలి.

# మహిళ రిజర్వేషన్‌లు అన్ని రంగాల్లో అమలు చేయాలి.

## - తెలంగాణ యునివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి) పిట్ల. సరిత.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 4**




కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు 33.1/2 శాతం రిజర్వేషన్లు దేశంలోని అన్ని రంగాల్లో అమలు చేయాలని తెలంగాణ యునివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి) పిట్ల. సరిత డిమాండ్ చేశారు. ఆదివారం ప్రగతిశీల మహిళ సంఘం నిజామాబాద్ డివిజన్ కమిటీ 7వ మహాసభ ను మోపాల్ మండల కేంద్రంలో నిర్వహించారు. మహాసభకు ముందు పిఓడబ్ల్యూ జెండాను మహిళ సంఘం సీనియర్ నాయకులు వేల్పూరు లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సరిత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో పెట్టిన మహిళా బిల్లు నేటికీ అమలుకు నోచుకోవడం లేదని, బిల్లు అలంకార ప్రాయంగా మారిందని, ఎన్నికల స్టంట్ గా బిల్లు ఉపయోగపడటం విచారకరం అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మహిళలను ఎన్నికల స్టంట్ లు ఉపయోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న పథకాలు కాదు మహిళలకు కావాల్సింది, అన్ని రంగాల్లో సమాన హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు చట్టాలను అమలు చేయాలని కోరారు. మహిళ సాధికారత అంటే కొంత మంది డబ్బున్న కుటుంబాల మహిళలకు పెట్టుబడుల వైపు తీసుకుపోవడమే పరిష్కారం కాదని, అన్ని వర్గాల మహిళలను ఆర్థికంగా, సామాజికంగా, సమానత్వ అభివృద్ధి జరిగినప్పుడే మహిళ సాధికారత జరుగుతుంది అన్నారు. సీపీఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ నిజామాబాద్ డివిజన్ కమిటీ కార్యదర్శి వేల్పూరు భూమయ్య మాట్లాడుతూ, మహిళల కు అన్ని రంగాలలో సమాన వాటా కోసం పోరాటం చేసే వైపుగా మహాసభ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. మహిళలు కుటుంబంలో ప్రధాన భాగం కాబట్టి మహిళా అభ్యున్నతే దేశ అభ్యున్నతి అన్నారు.పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ మాట్లాడుతూ మహిళలు లేని రంగమే లేదు,ఐనా రెండవ శ్రేణి పౌరులుగా చూస్తున్నారని అన్నారు. ఉద్యోగాలలో వివక్ష చూపుతున్నారని అన్నారు. ఈ పరిస్థితి మారాలంటే పోరాటమే శరణ్యం అన్నారు.
ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో జిల్లా నాయకురాలు భారతి, నిజామాబాద్ నగర అధ్యక్షురాలు నీలం లక్ష్మి, ప్రధాన కార్యదర్శి జి.సంజన, డివిజన్ నాయకులు సబిత, అనంతక్క రాధ, రజిత, అనూజ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి.

## - టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 4**




రాష్ట్ర ప్రభుత్వం పెండింగులో ఉన్న ఉపాద్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్, ఓ. రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని స్థానిక మల్లు స్వరాజ్యం ట్రస్టు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్, ఓ. రమేష్ మాట్లాడుతూ, అసెంబ్లీలో గత ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ప్రకారం 5571 పీఎస్‌హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి సర్వీసు నిబంధనల జి.ఓ. 11,12 లను సవరించి డిగ్రీ, బిఎడ్ అర్హతలతో నియామకమైన ఎస్జిటీ లకు కూడా పీఎస్‌హెచ్ఎం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఎస్జిటీ ఉపాధ్యాయులందరిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసు నిబంధనల సవరణకు ముందు ఏర్పడిన స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, పిడి ఖాళీలను కామన్ సీనియారిటీ ప్రకారం ఎస్జిటీ లకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, గతంలో తాము చేసిన ప్రాతినిధ్యం పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బకాయి పడిన ఆరు డిఎ లను తక్షణమే విడుదల చేయాలని, పిఆర్సి రిపోర్టును తెప్పించుకుని ఫిట్ మెంట్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 317 జి .ఓ. వల్ల స్థానికత కోల్పోయిన టీచర్స్ అందరినీ సొంత జిల్లాలకు కేటాయించాలని, ట్రెజరీ ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద మూలుగుతున్న బిల్లులను క్లియర్ చేయాలన్నారు. నూతన నియామకాలు చేపట్టి ఖాళీలను భర్త చేయాలని కోరారు.కెజిబీవీ, యుఆర్ఎస్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి మినిమం టైం స్కేల్ చెల్లించాలని, వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, సమానపనికీ సమానవేతనం చెల్లించి, రెగ్యులర్ వారితో సమానంగా సెలవులు వర్తింప చేయాలన్నారు. నైట్ డ్యూటీలను రద్దు చేసి కేర్ టేకర్లను నియమించాలనీ డిమాండ్ చేశారు.గురుకుల పాఠశాలల టైం-టేబులను సాధారణ పాఠశాలలతో సమానంగా మార్చాలని, నైట్ డ్యూటీ నుండి విముక్తి కలిగించి కేర్ టేకర్లను నియమించాలన్నారు. పదోన్నతుల్లో జరిగిన నష్టాన్ని నివారించి తగిన న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, జిల్లా ట్రెజరర్ మల్లేష్, జిల్లా కార్యదర్శులు గంగాధర్, జనార్ధన్, రాజారాం, ఆనందం, బాబులు, జిల్లా కమిటి సభ్యులు శంకర్, గంగాధర్, లక్ష్మణ్, రాజేశ్వర్, రవీందర్, బాజన్న, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లలు దాటిన ఎల్లోరా గుహల ఘన కీర్తి.. !

**ఎల్లోరా గుహలు (మహారాష్ట్ర లోని)**






ఔరంగాబాద్ పట్టణం నుండి 28 కి. మీ.ల దూరంలో ఉంటాయి. ఒక కొండకు ఉన్న పెద్ద బండ రాయిని (ఏకశిలను) తొలిచి, గుహల్లాంటి విశాలమైన చైత్యాలు, విహారాలు (హాల్స్), వసారాలు ఇతర గదులు, ఆలయాలు, ధ్యాన మందిరాలు చెక్కారు (నిర్మించారు).ఇక్కడ మూడు మతాలకు చెందిన మొత్తం 34 గుహలు ఉన్నాయి. ఈ గుహలకు (మన సౌలభ్యం కోసం) 1 నుండి 34 వరకు సీరియల్ నెంబర్లు కేటాయించారు.ఈ ఎల్లోరా గుహల కంటే అజంతా గుహలే చాలా ప్రాచీనమైనవి. అక్కడ క్రీ. పూ. 200 నుండే గుహలు చెక్కడం ప్రారంభించారు. ఎల్లోరా గుహలు కూడా ప్రాచీనమైనవే. ఈ గుహల్లో 1 నుండి 12 వ నెంబరు వరకు గల గుహలను అన్నింటికంటే ముందు చెక్కారు. ఈ శ్రేణిలో ఇవే ప్రాచీనమైనవి. అంటే వీటిని క్రీ.శ. సుమారు 500 నుండి 700 సంవత్సరాల మధ్య కాలంలో తొలిచారు.ఆతర్వాత ఉన్న 13 నుండి 29 వ నెంబరు వరకు గల గుహలు బ్రాహ్మణీయ, వైదిక (హిందూ) మతానికి చెందినవి. వీటిని క్రీ. శ. సుమారు 7 నుండి 9 వ శతాబ్దం మధ్య కాలంలో చెక్కారు.అలాగే 30 నుండి 34 వ నెంబరు గల గుహలు జైన మతానికి చెందినవి. ఈ గుహలను క్రీ. పూ. సుమారు 9 నుండి 11 వ శతాబ్దం మధ్య కాలంలో చెక్కారు.ఈ ఎల్లోరా గుహలన్నీ ఉత్తరం నుండి దక్షిణానికి సుమారు రెండు కి. మీ. ప్రాంతంలో వ్యాపించి ఉన్నాయి.ఈ గుహలన్నీ అజంతాలో ఉన్నట్టు ఒకదానికొకటి ఆనుకొని ఉండవు. విశాలమైన స్థలంలో, వాలుగా ఉన్న ఏకశిలా కొండకు క్రింది భాగంలో, విడివిడిగా ఒకదానికీ మరొకదానికీ మధ్య తగినంత ఎడం పాటించి కాస్త దూర, దూరంగా చెక్కారు. ఈ గుహలన్నిటి లోకెల్లా బ్రాహ్మణీయ, వైదిక (హిందూ) మతానికి చెందిన, కైలాస ఆలయం (16వ నెంబర్ గుహ) అత్యంత ప్రధానమైనది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఈ గుహ, ఎల్లోరా గుహలు అన్నింటిలోకెల్లా, అత్యంత అద్భుతమైన పనితనం గలది. ఇది మొత్తం ఎల్లోరాకే తల మాణికం వంటిది.ఎల్లోరా గుహలు అన్నీ చూడదగ్గవే, అయినప్పటికి 5వ, 10వ, 11వ, 12వ, 15వ, 16వ, 21వ, 29వ, 32వ, మరియూ 34వ నెంబర్లు గల గుహలు మాత్రం మిస్ కాకుండా చూడాలి.

- రాజేశ్వర్ చెలిమల.




# కల్లుడిపో "కులం" కోసమా... "కుటుంబం" కోసమా?.

వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఆగస్టు 4:

మూడో డిపోలో ముగ్గురిదే పెత్తనం.
సొసైటిలో అక్రమాలపై అనేక పిర్యాదులు.
ఎక్సైజ్ శాఖ స్పందించచక పోవడం పై అనుమానాలు.

చీమల పెట్టిన పుట్టలో పాములు చొర బడిన చందంగా మారింది నగరంలోని మూడో కల్లు డిపో పరిస్థితి. కార్మికుల పేరుతో ఎర్పాటు అయిన సొసైటిని, కొంతమంది వ్యాపారులు అక్రమంగా సొంతం చేసుకొని పబ్బం గడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడో కల్లు డిపోలో ముగ్గురి పెత్తనం కొనసాగుతుండగా, సొసైటీ లో నిజమైన కార్మికులను పక్కన పెట్టి, వ్యాపారుల కుంటుంబం, బందువుల పేర్లు చేర్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. సొసైటీ లో జరుగుతున్న అక్రమాలపై ఎక్సైజ్ శాఖకు పిర్యాదులు అందినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారంలో ఏ పార్టీ ఉంటే, ఆ నాయకుల పేర్లు చెప్పి అక్రమాలపై ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్న సందర్భాలు సైతం ఉన్నాయి. గతంలో సిఎం కూతురి పేరు చెప్పుకొని బతికిన వ్యాపారులు, ప్రస్తుతం అధికార పార్టీ నాయకుల పేర్లు వాడుకుంటున్నారు.

**సొసైటీ ఏర్పడిన తీరు.**

నిజామాబాద్ నగరంలోని మూడవ కల్లు సొసైటీ కోసం గీత కార్మికులు కొన్ని సంవత్సరాల పాటు పోరాటం నిర్వహించారు. ఆ సమయంలో తనకు రాజకీయ పలుకుబడి ఉందనీ, సొసైటీ ఏర్పాటుకు సహకరిస్తానని ఓ నాయకుడు మధ్యలోకి వచ్చాడు. అతనిని కార్మికులు పూర్తిగా నమ్మారు. కార్మికుల పోరాటం ఫలించి 2016 సంవత్సరంలో సొసైటీ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. అప్పటి నుండి సొసైటీలో ఆ నాయకుడి కుట్రలు మొదలయ్యాయి. తన కుటుంబ సభ్యులు, బంధు, బలగంతో అక్రమ పద్ధతిలో తాడీ కోఆపరేటివ్ సొసైటీ చట్టాలను సైతం నియమావళి సైతం తుంగలోకి తొక్కి, నాడు ఉన్న ఎక్సైజ్ అధికారులను నమ్మించి, అప్పటి ముఖ్యమంత్రి కూతురు పేరును వాడుకొని, అధికార పార్టీ నాయకుడిగా చలామణి అవుతూ, వేల కుటుంబాలు ఉన్నాయని నమ్మించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సొసైటీని తమ కుటుంబ లాభాల సంస్థగా మార్చుకున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

**నిబంధనలు గాలికి.**

టాడి కోపరేటివ్ సొసైటీ ప్రకారం సభ్యులుగా ఉండాలంటే గీతా కార్మికులై ఉండాలన్న నిబంధన ఉంది. నిజమైన గీతా కార్మికులకు మాత్రమే ఇందులో సభ్యులుగా ఉండే అవకాశం ఉంటుంది. ఇక్కడ మాత్రం ఇలాంటి నిబంధనలు పాటించడం లేదని తెలుస్తుంది. గీతా కార్మిక పరీక్ష నిర్వహించిన సమయంలో నిజమైన గీతా కార్మికులతో చెట్లు






మూడో డిపోలో సభ్యులుగా సాయాగౌడ్, చరణ్‌గౌడ్ సాయాగౌడ్ స్థానంలో మరొకరితో టాడి టాపర్ పరీక్ష, చరణ్‌గౌడ్ స్థానంలో మరొకరితో..

ఎక్కించి గీత గీయడం జరిగింది. ఇక్కడ వరకు బాగానే ఉంది, కానీ అటు తర్వాత ఎక్సైజ్ ఆఫీసుకు వచ్చిన తర్వాత నిజమైన గీతా కార్మికుల యొక్క ఫోటోలను మార్చి స్థానికంగా లేనటువంటి గీతా కార్మికులను, దుబాయి లో ఉన్నవారికి, వేరే జిల్లాలో ఉన్న తన సమీప బంధువులను, వేరే గ్రామాలకు చెందిన కుటుంబ సభ్యులను చేర్చి టిసిఎస్ సభ్యులుగా సొసైటీని ఏర్పాటు చేయించడం జరిగిందని పిర్యాదులు ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సొసైటీ పైన సొసైటీలో చలామణి అవుతున్న సభ్యుల పైన అనేక ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ డిపో యజమానిగా చెలామణి అవుతున్న కుటుంబానికి వ్యతిరేకంగా ఉన్న కొద్దిమంది సభ్యులను తొలగించినట్టు తెలిసింది. ఈ సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై అక్రమ సభ్యులపై గత రెండు నెలల నుంచి గీతా కార్మిక సంఘాల నాయకులు, గౌడ యువజన సంఘం నాయకులు ఎక్సైజ్ జిల్లా స్థాయి అధికారుల నుండి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వరకు ఫిర్యాదులు సైతం అందజేశారు. ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు ఈ అక్రమ సభ్యుల పైన, స్థానికేతరుల నివాస ధ్రువీకరణ పత్రాలను, ఆధార్ కార్డులను, రేషన్ కార్డులను, రెండు చోట్ల టిఎస్పి లైసెన్స్ ను కలిగిన సభ్యులను విచారణ చేపట్టకుండా ఉండటం పై అనుమానాలు కలుగుతున్నాయి.

గత కొద్ది రోజుల క్రితం ఎటువంటి వీడియో చిత్రీకరణ లేకుండా ఈ డిపో నుండి కల్లు షాంపిల్స్ మరియు ఈ డిపోకు సంబంధించిన రెండు దుకాణాల నుండి కల్లు షాంపిల్స్ సేకరించి హైదరాబాద్ ల్యాబ్ పంపకుండా ఎక్సైజ్ ఆఫీస్ లోనే ఉంచుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆరోపణలు వస్తున్నాయి.

మూడవ డిపోలో ఆ ముగ్గురి ఆధిపత్యంతో ఇది గీతా కార్మిక సహకార సంఘమా లేకా సేపూరు కుటుంబ సంఘమా అని కార్మికులు చర్చించుకుంటున్నారు.

గీతా కార్మికులకు న్యాయబద్ధంగా రావలసిన డబ్బులను ఇవ్వకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, సొసైటీని నిజమైన కార్మికులకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. సొసైటీలో జరగుతున్న అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కార్మికులు ఎక్సైజ్ శాఖ అధికారులను కోరుతున్నారు.

## విద్యార్థులకు కారం భోజనం పై డిఇఓ విచారణ.

- బాధ్యులపై ఆగ్రహం.

వేగుచుక్క న్యూస్:నిజామాబాద్




జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో కారం నూనెతో విద్యార్థులకు భోజనం పై డిఇఓ దుర్గ ప్రసాద్ ఆదివారం విచారణ జరిపారు. సంబంధిత వంట కార్మికులు, ప్రధాన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో సారి ఇలాంటి ఘటనలు జరగకుండా వారికి తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవలని డిఇఓ ఆదేశించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ, మధ్యాహ్నం భోజన కార్మికులకు చెల్లించవలసిన బకాయిలకు ఇప్పటివరకు 58.69 కోట్ల రూపాయలను జిల్లా విద్యాశాఖ అధికారులకు విడుదల చేయటం జరిగిందన్నారు. ఇంకను 18 కోట్లు 5 నాడు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు ఒకటి నుండి 8 తరగతి వరకు చెల్లించవలసిన వంట ఖర్చులు, వంట కార్మికులకు వెయ్యి రూపాయల వేతనం జూన్ నెల వరకు చెల్లించామని, ఈ చెల్లింపులు ప్రతినెల చెల్లించుట జరుగుతున్నదని వివరించారు. వంట కార్మికులకు చెల్లిస్తున్న 2,000/ ల వేతనం నకు సంబంధించిన బిల్లులు చెల్లింపుల కొరకు జూన్ నెల వరకు నిధులు విడుదల చేయదం జరిగిందని అన్నారు. జూలై నెల వేతనం చెల్లింపు కొరకు నిధులు 5న విడుదల అవుతాయని తెలిపారు.

## పిడిఎస్‌యూ నగర కార్యవర్గం ఎన్నిక.



వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఆగస్టు 4:

పిడిఎస్‌యూ నిజామాబాద్ నగర మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షురాలుగా నీలం లక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఆకుల సబితా, ప్రధాన కార్యదర్శి గొంట్యాల సంజన, సహాయ కార్యదర్శి గా శాంతక్క, కోశాధికారి పొన్ను మానస ఎన్నిక అయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఉమారణి, రాజ్యలక్ష్మి, తంకడి రేఖ, మశాల్కర్ సురేఖ, ఆనంతక్క, వనమాల మాధవి, గంగా, పావని, లక్ష్మి లను ఎన్నుకోవడం జరిగింది.

## మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటీకరణ వద్దు.

- యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రపాణి.

వేగుచుక్క న్యూస్, నిజమాబాద్:




మధ్యాహ్న భోజన పథకంనూ ప్రైవేటీకరణ చేయొద్దని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రపాణి కోరారు. ఈ మేరకు ఆదివారం నగరానికి వచ్చిన సిపిఐ ఎమ్మెల్యే కూన%శీ%నేని సాంబశివరావు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకాన్ని గత 22 సంవత్సరాల నుంచి ఎంతో నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ, కష్టనష్టాలకు ఓర్చుకొని, ప్రభుత్వం సరైన టైముకు బిల్లులు ఇవ్వకుండా సరిపడా స్లాబ్ రేట్ ఇవ్వకున్నా విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం 10000 వేతనం ఇవ్వాలని, పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిత్యవసర వస్తువులు, గ్యాస్, కోడిగుడ్ల తో సహా సరఫరా చేసి పిల్లలకు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు.

## సమగ్ర వ్యవసాయ ప్రణాళికలు ముఖ్యం !

రుణమాఫీ యావత్తు ప్రక్రియ పంద్రాగస్ట్ నాటికి పూర్తవుతుందని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ క్రమంలో ఇక రైతులకు ఏం చేస్తే మంచిదో ఆలోచన చేయాలి. అదేపనిగా రుణమాఫీలు లేకుండా వ్యవసాయాన్ని పరిశ్రమగా చేయగలగాలి. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. పెరుగుతున్న పప్పులు, బియ్యం, ఉల్లిగడ్డలు, అల్లం వెల్లుల్లి ధరలను దృష్టిలో పెట్టుకుని, ఆ పంటలను ప్రోత్సహించాలి. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటుల ఎక్కడెక్కడ పండుతాయో ప్రణాళికలు సిద్ధం చేసి, రైతులు ఆయా పంటలు పండిచేలా చేయాలి. భూసార పరీక్షలు జరిపించి, సేంద్రియ ఎరువులను సిద్ధంచేసి రైతులకు అందుబాటులోకి తేవాలి. దీంతో వారు కూడా ఆయా పంటలు వేయడానికి సిద్ధం అవుతారు. అవసరమైతే రైతులకు పంటలపై అవగాహనా శిబిరాలు నిర్వహించాలి. ఇలా చేయడం వల్ల ఆహారా ధాన్యాల కొరతను అధిగమిస్తాం. రైతులకు కూడా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కుతాయన్న భరోసా కలుగుతుంది. నిజానికి దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రణాళిక రావాలి. కనీసం తెలుగు రాష్ట్రాల్లో అయినా ఇలాంటి ప్రణాళికలు వస్తే దేశానికి ఆదర్శంగా ఉంటుంది. వ్యవసాయం బాగుపడాలంటే కొంతవరకు రైతులను ఆదుకోవాల్సిందే. వారికి అండగా నిలవాల్సిందే. అన్నింటికి మించి వ్యవసాయ పరంగా అన్ని రకాల సాయం అందించాల్సిందే. ఇదే సందర్భంలో వారు స్వయం సమృద్ధి సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి.

## ప్రభుత్వాలు విద్య వైద్యం ఉచితంగా అందించాలి.

మోడీ ప్రభుత్వం
పేదలకు వ్యతిరేకం.
బడా పారిశ్రామిక వేత్తలకు
రూ" కోట్ల మాఫీ.
సీపీఐ ఎమ్మెల్యే కూనం
నేని సాంబశివరావు.



వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఆగస్టు 4:

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వైద్యం ఉచితంగా అందించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ పార్టీ, ఏఐటీయూసీ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లాల రాజకీయ శిక్షణ తరగతులు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిఎన్జీఓ భవన్ లో మీడియాతో కూనం నేని మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపు అనేది ఏమాత్రం పేద వాడికి అందుతుందో లేదో అని చూడకుండా లెక్కలు వేసి చూస్తున్నరే తప్ప ఎంతవరకు అందుతుందని చూడటం లేదని అన్నారు. ఈ రంగానికి ఇంత అంటూ బడ్జెట్ పెడుతున్నారని, కానీ ఆ బడ్జెట్ పేదలకు పూర్తిగా లబ్ది చేకూరడం లేదన్నారు. ప్రభుత్వాలు పేదవానికి డైరెక్టుగా లబ్ది చేకూరే పథకాలు ప్రవేశపెట్టాలని అన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు 30 లక్షల కోట్ల రూపాయలు బకాయిలు మాఫీ చేశారని, పేదలకు మాత్రం చెయ్యటానికి మనసు ఒప్పడం లేదని అన్నారు. అసెంబ్లీలో పేద వానికి పక్షాన మాట్లాడే గొంతుకలు కరువయ్యాయని అన్నారు. నిజామాబాద్ లో మోడీ ద్వారా హామీ ఇప్పించిన ఎంపీ ధర్మపురి అరవింద్ పసుపు బోర్డు ఎక్కడ పెట్టాడో చూపించాలని, రెండో సారి గెలిచిన అరవింద్ బోర్డ్ ఊసే లేదని, బోర్డు తెస్తారా లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో బూతులు తిట్టుకుంటూ, సహనం కోల్పోయి ఒకరినొకరు నిందించుకోవడం ఎక్కువైందని ఇలా చేస్తున్న ఎమ్మెల్యేలపై వేటు వేయాలని అన్నారు. ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపించేది ప్రజల సమస్యల మీద పోరాటం చేస్తారని గాని, వారి స్వలాభం కోసం కాదని గుర్తు చేశారు. పేదవాని తరుపున మాట్లాడేది సిపిఐ తో పాటు ఎర్ర జండా పార్టీ లేనని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు ఏలిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, పేదవాని సమస్యలు మాత్రం తీరటం లేదన్నారు. పేదవాడు పేదవాడిగానే మిగులుతున్నాడని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులను దోపిడీ చేసేందుకు ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు అంటూ వివిధ పేర్లతో ముందుకు వస్తున్నారన్నారు. అసంఘటిత రంగం కార్మికులు రెండు కోట్లకు పైగా ఉన్నారని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వలని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించాలని అన్నారు. ప్రతి పేదవానికి ఎంత చదివితే అంత విద్య, ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, సిపిఐ కార్యవర్గ సభ్యులు నాయకులు సాయిలు, విఠల్ గౌడ్, చక్రపాణి, వివిధ సంఘాల బాధ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుబంధాలకు ప్రతిరూపం "స్నేహబంధం"

"సత్యశోధక్" ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.

వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఆగస్టు 4:




- విద్యార్థుల వినూత్న ప్రదర్శన.

కష్ట సమయంలో కలత చెందిన మనసుకి ప్రశాంతతను కలిగించే దివ్య ఔషధం స్నేహమని, అమ్మ అనే పదం తర్వాత ఆత్మీయతను ధ్వనింపజేసే ఏకైక పదం స్నేహమని, ఆత్మీయత, అనుబంధాలకు ప్రతిరూపం స్నేహబంధమని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. ప్రతి సంవంత్సరం ఆగష్టు మాసం మొదటి ఆదివారం జరుపుకునే స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యశోధక్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు "హ్యాపీ ఫ్రెండ్షిఫ్ డే " అనే ఆంగ్ల అక్షరాల నమూనాలో కూర్చొని శుభాకాంక్షలు తెలుపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, సృష్టిలో స్వచ్ఛమయిన స్నేహన్ని మించినది ఏదీ లేదని, స్నేహానికి కులం, మతం, జాతి అనే తారతమ్యం ఉండదని అన్నారు. ఇది సాంస్కృతిక, సామాజిక భేదాలకు అతీతంగా, సామాజిక సామరస్యాన్ని, అవగాహనను పెంపొందించే బంధంగా, విభేదాలను తగ్గించడంలో, పరస్పర గౌరవాన్ని ప్రోత్సహించడంలో స్నేహబంధం ముఖ్య పాత్ర పోషిస్తుందని నర్సయ్య అన్నారు.ఏ బంధం లేకున్నా స్నేహమనే బంధంతో ముడిపడి పరిణతి చెందుతూ కాలక్రమేణా బలమైన బంధంగా మారి అన్నింటికి చేయుతనిచ్చేదే నిజమైన స్నేహ బంధమన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎదుగుదలకు వ్యక్తిగత నిర్మాణానికి, మానవీయ విలువలు పెంపొందింపచేయడంలో స్నేహితుల పాత్ర ప్రధానమైనదన్నారు.